# 2 సమూయేలు 24వ అధ్యాయము

1 ఇంకొకమారు యెహోవా కోపము ఇశ్రాయేలీయుల మీద రగులుకొనగా ఆయన దావీదును వారిమీదికి
ప్రేరేపణచేసి – నీవు పోయి ఇశ్రాయేలువారిని యూదావారిని లెక్కించుమని అతనికి ఆజ్ఞ ఇచ్చెను. 2 అందుకు
రాజు తన యొద్దనున్న సైన్యాధిపతియైన యోవాబును పిలిచి– జనసంఖ్య యెంతైనది నాకు తెలియగలందులకై
దాను మొదలుకొని బెయేర్షెబా వరకు ఇశ్రాయేలు గోత్రములలో నీవు సంచారముచేసి వారిని లెక్కించుమని ఆజ్ఞ
ఇయ్యగా 3। యోవాబు – జనులు సంఖ్య యెంతయున్నను నా యేలినవాడవును రాజవునగు నీవు బ్రదికియుండగానే
దేవుడైన యెహోవా దానిని నూరంతలు ఎక్కువ చేయునుగాక; నా యేలినవాడవును రాజవునగు నీకు ఈ కోరిక
ఏలపుట్టెననెను. 4। అయినను రాజు యోవాబునకును సైన్యాధిపతులకు గట్టి ఆజ్ఞ ఇచ్చియుండుటచే యోవాబును
సైన్యాధిపతులును ఇశ్రాయేలీయుల సంఖ్య చూచుటకై రాజసముఖమునుండి బయలువెళ్లి 5 యొర్దాను నది దాటి
యాజేరుతట్టున గాదు లోయ మధ్యనుండు పట్టణపు కుడిపార్శ్వమున నున్న అరోయేరులో దిగి 6 అక్కడనుండి
గిలాదునకును తహ్తింహోద్షీ దేశమునకును వచ్చిరి; తరువాత దానాయానుకును పోయి తిరిగి సీదోనునకు
వచ్చిరి. 7 అక్కడ నుండి బురుజులుగల తూరు పట్టణమునకును హివ్వీయులయొక్కయు కనానీయుల యొక్కయు
పట్టణములన్నిటికిని వచ్చి యూదాదేశపు దక్షిణదిక్కుననున్న బెయేర్షెబా వరకు సంచరించిరి. 8 ఈ ప్రకారము
వారు దేశమంతయు సంచరించి తొమ్మిదినెలల ఇరువది దినములకు తిరిగి యెరూషలేమునకు వచ్చిరి. 9 అప్పుడు
యోవాబు జనసంఖ్య వెరసి రాజునకు అప్పగించెను; ఇశ్రాయేలువారిలో కత్తి దూయగల యెనిమిది లక్షలమంది
యోధులుండిరి; యూదావారిలో అయిదు లక్షలమంది యుండిరి. 10 జనసంఖ్య చూచినందుకై దావీదు మనస్సు
కొట్టుకొనగా అతడు – నేను చేసిన పనివలన గొప్ప పాపము కట్టుకొంటిని, నేను ఎంతో అవివేకినై దాని చేసితిని;
యెహోవా, కరుణయుంచి నీ దాసుడనైన నా దోషమును పరిహరింపుమని యెహోవాతో మనవి చేయగా 11
ఉదయమున దావీదు లేచినప్పుడు దావీదునకు దీర్ఘదర్శియగు గాదునకు యెహోవా వాక్కు ప్రత్యక్షమై యీలాగు
సెలవిచ్చెను 12 నీవు పోయి దావీదుతో ఇట్లనుము – యెహోవా సెలవిచ్చున దేమనగా – మూడు విషములను నీ
యెదుట పెట్టుచున్నాను; వాటిలో ఒకదానిని నీవు కోరుకొనిన యెడల నేనది నీమీదికి రప్పించెదను. 13 కావున
గాదు దావీదునొద్దకు వచ్చి యిట్లని సంగతి తెలియజెప్పెను – నీవు నీ దేశమందు ఏడు సంవత్సరములు క్షామము
కలుగుటకు ఒప్పుకొందువా? నిన్ను తరుముచున్న నీ శత్రువు యెదుట నిలువలేక నీవు మూడు నెలలు పారిపోవుటకు
ఒప్పుకొందువా? నీ దేశమందు మూడు దినములు తెగులు రేగుటకు ఒప్పుకొందువా? యోచనచేసి నన్ను పంపినవానికి
నేనియ్యవలసిన యుత్తరము నిశ్చయించి తెలియజెప్పుమనెను. 14 అందుకు దావీదు – నాకేమియు తోచకున్నది,
గొప్ప చిక్కులలో ఉన్నాను, యెహోవా బహు వాత్సల్యత గలవాడు గనుక మనుష్యుని చేతిలో పడకుండ యెహోవా
చేతిలోనే పడుదుము గాక అని గాదుతో అనెను. 15 అందుకు యెహోవా ఇశ్రాయేలీయుల మీదికి తెగులు
రప్పించగా ఆ దినము ఉదయము మొదలుకొని సమాజకూటపువేళ వరకు అది జరుగుచుండెను; అందుచేత
దానునుండి బెయేర్షెబా వరకు డెబ్బదివేలమంది మృతినొందిరి. 16 అయితే దూత యెరూషలేము పైని హస్తము

చాపి నాశనము చేయబోయినప్పుడు, యెహోవా ఆ కీడునుగూర్చి సంతాపమొంది – అంతే చాలును, నీ చెయ్యి
తీయుమని జనులను నాశనము చేయు దూతకు ఆజ్ఞ ఇచ్చెను. యెహోవా దూత యెబూసీయుడైన అరౌనాయొక్క
కళ్లము దగ్గర ఉండగా 17 దావీదు జనులను నాశనము చేసిన దూతను కనుగొని యెహోవాను ఈలాగు
ప్రార్థించెను – చిత్తగించుము; పాపము చేసినవాడను నేనే; దుర్మార్గముగా ప్రవర్తించినవాడను నేనే; గొఱ్ఱెలవంటి
వీరేమి చేసిరి? నన్నును నా తండ్రి యింటివారిని శిక్షించుము. 18 ఆ దినమున గాదు దావీదునొద్దకు వచ్చి – నీవు
పోయి యెబూసీయుడైన అరౌనా యొక్క కళ్లములో యెహోవా నామమున ఒక బలిపీఠము కట్టించుమని అతనితో
చెప్పగా 19 దావీదు గాదుచేత యెహోవా యిచ్చిన ఆజ్ఞ చొప్పున పోయెను. 20 అరౌనా రాజును అతని సేవకులును
తన దాపునకు వచ్చుట చూచి బయలుదేరి రాజునకు సాష్టాంగ నమస్కారముచేసి – నా యేలినవాడవును
రాజవునగు నీవు నీ దాసుడనైన నా యొద్దకు వచ్చిన నిమిత్తమేమని అడుగగా 21 దావీదు – ఈ తెగులు
మనుష్యులకు తగలకుండ నిలిచిపోవునట్లు యెహోవా నామమున ఒక బలిపీఠము కట్టించుటకై నీయొద్ద ఈ
కళ్లమును కొనవలెనని వచ్చితిననెను, 22 అందుకు అరౌనా – నా యేలినవాడవగు నీవు చూచి యేది నీకు
అనుకూలమో దాని తీసికొని బలి అర్పించుము; చిత్తగించుము, దహనబలికి ఎడ్లున్నవి, నూర్చుకఱ్ఱ సామానులు
కట్టెలుగా అక్కరకు వచ్చును. 23 రాజా, యివన్నియు అరౌనా అను నేను రాజునకు ఇచ్చుచున్నానని చెప్పి – నీ
దేవుడైన యెహోవా నిన్ను అంగీకరించును గాక అని రాజుతో అనగా 24 రాజు – నేను ఆలాగు తీసికొనను, వెల
యిచ్చి నీ యొద్ద కొందును, వెల యియ్యక నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహనబలిగా
అర్పించనని అరౌనాతో చెప్పి ఆ కళ్లమును ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను. 25 అక్కడ దావీదు యెహోవా
నామమున ఒక బలిపీఠము కట్టించి దహనబలులను సమాధాన బలులను అర్పించెను; యెహోవా దేశము కొరకు
చేయబడిన విజ్ఞాపనలను ఆలకింపగా ఆ తెగులు ఆగి ఇశ్రాయేలీయులను విడిచి పోయెను.